
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
మంగళవారం 13 మే 2025




గ్రామపాలన అధికారులు వచ్చేస్తున్నారు

ప్రతి గ్రామానికో రెవెన్యూ అధికారి, లైసెన్స్‌డ్ సర్వేయర్

- భూవివాదాల పరిష్కారమే లక్ష్యంగా 'భూ భారతి'
- జూన్ 2 నుంచి కొత్త చట్టం అమలు
- ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు..సమస్యల పరిష్కారం
- జిల్లాలో పైలట్ ప్రాజెక్టుకు అక్కన్నపేట మండలం ఎంపిక
- ఇప్పటికే లైసెన్స్‌డ్ సర్వేయర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానించిన కలెక్టర్ మనుచౌదరి

భూ భారతి చట్టం జూన్ 2 నుంచి అమలులోకి రానుండగా, అదే రోజు నుంచే భూ సంస్కరణల అమలుకు రెవెన్యూశాఖ రంగం సిద్ధం చేసింది. ప్రధానంగా ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక గ్రామపాలనాధికారితో పాటు, మరో లైసెన్స్‌డ్ సర్వేయర్‌ను నియమించనుంది. ఏళ్లుగా భూ పట్టాల కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం పరిష్కరించనుంది. అంతేకాక సాదాబైనామాలు, ఇతర భూవివాదాలను పరిష్కరించనుంది. భూ వివాదాల పరిష్కారానికి ప్రతీ రెవెన్యూ గ్రామాన్ని తహసీల్దార్ నేతృత్వంలోని బృందం సందర్శించనుందని, దీనిని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం చెబుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సాదాబైనామాల దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తామని, అర్హులైనవారికి పట్టాలు సైతం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో సాదాబైనామాల దరఖాస్తుదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

- గజ్వేల్, మే 12 (ఆంధ్రజ్యోతి)



భూ భారతి చట్టం అధికారికంగా జూన్ 2 నుంచి అమల్లోకి రానుండటంతో, అదే రోజు నుంచి ప్రతీ రెవెన్యూ గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించింది. తహసీల్దార్ నేతృత్వంలోని రెవెన్యూ బృందాలు ప్రతీ గ్రామంలో సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి పరిష్కరిస్తారు. భూ భారతితో దాదాపు 80 శాతం సమస్యలు తహసీల్దార్ స్థాయిలో, మరో 10 శాతం ఆర్డీవో, ఇంకో 10 శాతం కలెక్టర్ స్థాయిలో పరిష్కారమయ్యే అవకాశముందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈనేపథ్యంలో భూ సమస్యలున్న వారంతా గ్రామాల్లో జరిగే సదస్సుల్లో సమస్యలు తెలియజేసి పరిష్కరించుకోవాలని కోరుతున్నారు. ఈ సదస్సులను ఇటీవలే జిల్లాలో భూ భారతి పైలట్ ప్రాజెక్టు మండలంగా తీసుకున్న అక్కన్నపేటలో గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు.

గ్రామానికో జీపీవో, లైసెన్స్‌డ్ సర్వేయర్

గత ప్రభుత్వం ధరణితో పాటు, వీఆర్వో వ్యవస్థను తొలగించింది. దీంతో గ్రామాల్లో రెవెన్యూ పాలనా వ్యవస్థ లేకుండాపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి చట్టాన్ని రద్దుచేసి దాని స్థానంలో భూభారతి చట్టాన్ని ప్రవేశపెడుతుండడంతో గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను పునఃప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ప్రతీ రెవెన్యూ గ్రామానికి ఒక జీపీవో (గ్రామపాలన అధికారి)తో పాటు లైసెన్స్‌డ్ సర్వేయర్‌ను నియమించాలని నిర్ణయించింది. జీపీవోల కోసం పూర్వ వీఆర్‌వోలు, అర్హత కలిగిన వీఆర్‌ఏలను దరఖాస్తు చేసుకోవాలని సూచించి, వారికి అవకాశం కల్పించగా, లైసెన్స్‌డ్ సర్వేయర్లుగా ప్రైవేట్ సర్వేయర్లకు, సర్వే శిక్షణ పొందిన యువతకు అవకాశం కల్పిస్తోంది. ఇప్పటికే దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ మనుచౌదరి పత్రికా ప్రకటనను విడుదల చేశారు. వీరికి శిక్షణ ఇచ్చి బాధ్యతలు అప్పగించనుంది. సర్వేయర్ల కొరతతో ఉమ్మడి జిల్లాలో పెద్ద సంఖ్యలో భూముల వివాదాలు నెలకొన్నాయి. ప్రతీ రెవెన్యూ గ్రామానికి ఒక సర్వేయర్‌ను నియమిస్తే సర్వేల సమస్యలు పరిష్కారమవుతుందనే నమ్మకంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. జీపీవో, సర్వేయర్లు జూన్ 2 నుంచి విధుల్లోకి రానున్నారు. సిద్దిపేట జిల్లాలో 397 మంది జీపీవోలు నియామకం కానున్నారు.



అక్కన్నపేట మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సాదాబైనామాలకు మోక్షం

గ్రామీణ ప్రాంత భూముల వివాదాల్లో కీలకమైన సాదాబైనామా రిజిస్ట్రేషన్లకూ భూభారతిలో మోక్షం కలగనుంది. భూభారతి అమల్లోకి వచ్చిన వెంటనే ఆర్డీవోల ద్వారా సాదాబైనామాల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నారు. 2014కు ముందు సాదాబైనామా ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేసినవారికి భూభారతిలో రిజిస్ట్రేషన్ చేసి, పట్టాలు అందించాలని నిర్ణయించారు. ఆర్డీవో స్థాయిలో వీటిని పరిష్కరించనున్నారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ ప్రవేశపెట్టినప్పుడు సైతం సాదాబైనామాలకు రిజిస్ట్రేషన్ల అవకాశం కల్పిస్తామని చెప్పి దరఖాస్తులు తీసుకుని వదిలేశారు. 2020 అక్టోబరు, నవంబరు నెలల్లో తీసుకున్న దరఖాస్తులను ఇప్పుడు భూభారతి ద్వారా పరిష్కరించాలని నిర్ణయించారు. సాదాబైనామాల ద్వారా భూముల కొనుగోలు చేసిన రైతులు మోఖాపై వారే ఉంటున్నప్పటికీ, రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో పట్టాలు పొందలేకపోయారు. దీంతో ప్రభుత్వం అందించే రైతు భరోసా, రైతు బీమా, పంట రుణాలు, ఎరువుల సబ్సిడీ, ఇతరత్రా ప్రయోజనాలు పొందలేకపోతున్నారు. ఈ డిమాండ్ ప్రధానంగా ఉండడంతో భూభారతిలో ఈ రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాలని

మిగతా 8లో..

తాగునీటికి ఢోకాలేదు

- త్వరలో గజ్వేల్, దుబ్బాకకు మల్లన్నసాగర్ నీరు
- ఈ వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చేశాం
- మిషన్ భగీరథ జిల్లా ఎస్ఈ పుట్ట వెంకట్‌రెడ్డి


పుట్ట వెంకట్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

దుబ్బాక, మే 12 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటతో పాటు జనగామ జిల్లాకు మిషన్‌భగీరథ ద్వారా అందించే తాగునీటికి ఢోకా లేదని మిషన్‌భగీరథ జిల్లా ఎస్ఈ (సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్) పుట్ట వెంకట్‌రెడ్డి అన్నారు. వచ్చే ఏడాది వరకు కూడా అందించేందుకు మల్లన్నసాగర్‌లో సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రో వాటర్‌స్కీం ద్వారా నీటిని పొందుతున్న దుబ్బాక, గజ్వేల్ నియోజక వర్గాలకు కూడా మల్లన్నసాగర్ ద్వారానే నీటిని అందించనున్నట్టు చెప్పారు. 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మరిన్ని వివరాలను వెల్లడించారు.

ఈ వేసవిలో జిల్లాలో తాగునీటి సమస్యను ఎలా ఎదుర్కొన్నారు..?

సిద్దిపేట జిల్లాలో నీటి సమస్య లేదు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టుల్లో తగినంత నీటి నిల్వలు ఉన్నాయి. అక్కడక్కడ నిర్వాహణ లోపం మూలంగానే సమస్య తలెత్తి ఉండొచ్చు. మా దృష్టికి రాగానే వెంటనే పరిష్కరించాం. మరోఏడాది వరకు కూడా సరిపడా నీటి నిల్వలు ఉన్నాయి. వర్షాలు ముందస్తుగా కురుస్తుండడంతో మరో మూడేళ్ల వరకు తాగునీటి సమస్య ఉండకపోవచ్చు.

దుబ్బాక, గజ్వేల్ మల్లన్నసాగర్‌కు అనుసంధానం చేస్తున్నారా..? ఎప్పటిలోగా పనులు పూర్తవుతాయి ?

దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గాలకు ఇప్పటివరకు కోమటి బండ నుంచి హెచ్ఎండబ్ల్యూఎస్ ద్వారా తాగునీరు సరఫరా అవుతుంది. మల్లన్నసాగర్ ద్వారానే నీటిని అందించాలని అనుకున్నాం. అందుకు 1.5 కిలోమీటర్ల పైపులైన్ పనులు మిగిలి ఉన్నాయి. పూర్తికాగానే రెండు నియోజక వర్గాలకు కూడా వీటి ద్వారానే నీటిని అందిస్తాం. సిద్దిపేట జిల్లాతో పాటు జనగామ జిల్లాకు కూడా ఇక్కడినుంచే నీటిని అందిస్తాం.

సిద్దిపేట, జనగామకు ఎన్ని ఎంఎల్‌డీల నీటిని వినియోగిస్తున్నారు?

ఇప్పటివరకు గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల మినహా జిల్లాలో, అలాగే జనగామ జిల్లాలోని మరికొన్ని ప్రాంతాలకు కలిపి 145 ఎంఎల్‌డీల తాగునీటిని అందిస్తున్నాం. గజ్వేల్, దుబ్బాకను కలిపితే మరో 65 ఎంఎల్‌డీలకు చేరుతాయి. మొత్తంగా సుమారు 210 ఎంఎల్‌డీల నీటిని అందించనున్నాం.

కొత్త కనెక్షన్లు ఎందుకు ఇవ్వడంలేదు?

కొత్త కనెక్షన్లు నిరంతర ప్రక్రియ. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు ఇవ్వాల్సిందిగా సూచించాం. కాలనీలు, ఇళ్ల నిర్మాణం అనేది నిరంతరం కొనసాగుతుంది. కాబట్టి దానిని స్థానిక అధికారులు నిర్వహించాల్సి ఉంటుంది.


తూకం వేసిన ధాన్యాన్ని లారీలో లోడ్ చేస్తున్న హమాలీలు

రైతులపై హమాలీ భారం

- ధాన్యం విక్రయాలకు తడిసి మొపెడవుతున్న ఖర్చులు
- క్వింటాకు రూ.50నుంచి రూ.60 వసూలు
- ప్రభుత్వమే చెల్లించాలని రైతుల డిమాండ్



సిద్దిపేట రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే రైతులపై హమాలీ భారం పడుతోంది. గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో హమాలీలకు ఒక్కో బస్తాకు రూ.15 నుంచి రూ.24 చొప్పున చెల్లిస్తున్నారు. గతంలో ప్రభుత్వమే హమాలీ ఖర్చును చెల్లించేది. దీంతో రైతులపై కొంత భారం తగ్గేది. 2017లో నుంచి ప్రభుత్వం హమాలీ ఖర్చు విషయంలో చేతులెత్తేసింది. ప్రభుత్వం మద్దతు ధర క్వింటాలుకు ఏ గ్రేడ్ రకం రూ.2320, కామన్ గ్రేడ్ రూ.2,300 చెల్లిస్తుంది. హమాలీలు తూకం వేసి లారీలో లోడ్ చేసినందుకు క్వింటాలుకు రూ.50 నుంచి రూ.60 వరకు వసూలు చేస్తున్నారు.

చేతులెత్తేసిన ప్రభుత్వం

కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన ధాన్యానికి హమాలీ ఖర్చుల కింద క్వింటాలుకు సుమారు రూ.5.30 చొప్పున ప్రభుత్వం హమాలీలకు చెల్లించేది. మిగిలిన డబ్బు రైతులు కలుపుకుని హమాలీలకు చెల్లించేవారు. ఆ తర్వాత రైతుల ఖాతాలో హమాలీ డబ్బు జమ చేయడంతో రైతులకు కొంత ఊరట లభించేది. 2017 నుంచి ప్రభుత్వం హమాలీ కూలీ ఖర్చులు చెల్లించడంపై చేతులెత్తేసింది. దీంతో రైతులకు భారంగా మారింది. పెరిగిన పెట్టుబడులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర సరిపోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హమాలీ ఖర్చులు పూర్తిగా ప్రభుత్వమే అందజేసేలా చూడాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

జోరుగా ధాన్యం కొనుగోళ్లు

జిల్లావ్యాప్తంగా కొనుగోళ్లు జోరందుకున్నాయి. కొన్ని చిన్న చిన్న కేంద్రాల్లో కొనుగోళ్లు తగ్గుముఖం పట్టాయి. మరికొన్ని కేంద్రాల్లో ధాన్యం కుప్పలుగా కుప్పలుగా ఉన్నాయి. జిల్లాలో ఐకేపీ ఆధ్వర్యంలో 210 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే పీఏసీఎస్ ఆధ్వర్యంలో 202 కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసి కొనుగోళ్లు చేపట్టారు. ఈ యాసంగి సీజన్‌లో వరినాట్లు వేసిన మొదటి దశ నుంచే మోగిపురుగు వ్యాపించడంతో పంటలపై ప్రభావం చూపి తీవ్రంగా దెబ్బతీసింది. రైతులు పంటలను కాపాడుకునేందుకు అధిక మొత్తంలో రసాయన మందులు వినియోగించారు. ఎకరాకు సుమారు రూ.20వేల నుంచి 25 వేల వరకు పెట్టుబడి పెట్టారు. అయితే దిగుబడి మాత్రం అంతంతే వచ్చిందని రైతులు వాపోతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు హమాలీ ఖర్చులు ఇచ్చి ప్రభుత్వమే ఆదుకోవాలి. పెరిగిన ఎరువుల ధరలతో రైతులకు పెట్టుబడి ఖర్చులు భారమై తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. కొన్నేళ్లుగా ప్రభుత్వం హమాలీ, తాళ్ల డబ్బు రైతులకు కానీ, నేరుగా హమాలీలకు కానీ చెల్లించడం లేదు. ప్రభుత్వం రైతులకు హమాలీ, తాళ్ల ఖర్చులు చెల్లించి అండగా నిలవాలి.

- జశ్వంత్‌రెడ్డి, భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు, సిద్దిపేట

రేణుకా ఎల్లమ్మ జాతర ప్రారంభం

- అంగరంగ వైభవంగా రేణుకా ఎల్లమ్మ, జమదగ్ని కల్యాణం
- పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- భారీగా తరలివచ్చిన భక్తజనం


జమదగ్ని ఎల్లమ్మదేవి కల్యాణం

హుస్నాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ జాతర సోమవారం ఉదయం వైభవంగా ప్రారంభమైంది. అమ్మవారికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంజుల దంపతులు పట్టువస్త్రాలను సమర్పించి దర్శనం చేసుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మండపాన్ని ఏర్పాటు చేసి రేణుకా ఎల్లమ్మ, జమదగ్ని మహామునిల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. దాదాపు రెండు గంటల పాటు కల్యాణ క్రతువు జరిగింది. ప్రభుత్వం తరపున మంత్రి పొన్నం ప్రభాకర్ జమదగ్ని, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి కల్యాణాన్ని తిలకించారు. ఎల్లమ్మ దేవి చరిత్రను పంబాల పూజారులు కథ ద్వారా వివరించగా వారితో మంత్రి స్టెప్పులు వేస్తూ ఉత్సాహపరిచారు. నెల రోజుల పాటు జరిగే ఈ జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఏర్పాట్లు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. కల్యాణంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఆర్డీవో రామ్మూర్తి, ఇవో కిషన్‌రావు, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, ఆలయ కమిటీ సభ్యులు పచ్చిమట్ల రాధ, పూదరి శ్రీనివాస్, ముప్పిడి రాజు, నర్సాగౌడ్, గాజుల భగవాన, రమాదేవి, పచ్చిమట్ల శ్రీకాంత్ ఉన్నారు.


పట్టువస్త్రాలను తీసుకొస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు


ఎల్లమ్మ కథ చెబుతున్న పంబాల వారితో స్టెప్పులు వేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కొమురవెల్లి కస్తూర్బాలో
అందుబాటులోకి ఇంటర్మీడియట్

- సీఈసీ, ఒకేషనల్ కోర్సులు మంజూరు
- ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రారంభం

చేర్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి కస్తూర్బాలో ఇంటర్మీడియట్ విద్య అందుబాటులోకి రానుంది. సీఈసీతో పాటు ఒకేషనల్ కోర్సును రానున్న విద్యాసంవత్సరం నుంచి ప్రారంభించనున్నారు. ఈ మేరకు విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కస్తూర్బా పాఠశాలలను ఇంటర్మీడియట్‌కు అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు తీసుకున్నప్పటికీ ఇక్కడ పాఠశాలను అప్‌గ్రేడ్ చేయలేదు. కొమురవెల్లి కస్తూర్బా పాఠశాల భవనంలో కొనసాగుతున్న దూల్మిట్ట కస్తూర్బాను తరలించడం భారంగా మారుతుందన్న కారణంగా ప్రతిపాదనను పక్కన పెట్టారు. నూతన మండలంగా ఏర్పడి ఎనిమిదేళ్లు గడిచినా ఇంటర్ విద్యకు నోచుకోకపోవడంతో ఈప్రాంత విద్యార్థులు కస్తూర్బాపై ఆశలు పెట్టుకున్నారు. కానీ విద్యాశాఖాధికారులు ప్రతిపాదన విషయంలో ప్రాధాన్యం కల్పించడం లేదన్న విషయమై ఇటీవల ఆంధ్రజ్యోతిలో "ఇంటర్ విద్యపై కినుక ఎందుకో ?" శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురించింది. ఈవిషయాన్ని జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి కొమురవెల్లి కస్తూర్బా ప్రతిపాదనను పరిశీలిస్తామని తెలిపారు. ఆయా పరిణామాల నేపథ్యంలో ఎట్టకేలకు ప్రతిపాదనలు పంపించడం కారణంగా కొమురవెల్లికి ఇంటర్ కోర్సులు మంజూరు చేస్తూ కళాశాల కోడ్ కూడా కేటాయించారు. తొలుతగా సీఈసీ, ఒకేషనల్ ఎంపీహెచ్‌డబ్ల్యు కోర్సులు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఒక్కో విభాగంలో 40 మంది చొప్పున అడ్మిషన్లు చేపట్టనున్నారు. కొమురవెల్లి కస్తూర్బా భవనంలో చదువుతున్న దూల్మిట్ట కస్తూర్బా విద్యార్థులకు చేర్యాలలో తరగతులు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. అందుకు పట్టణ శివారులోని ఓ ప్రైవేటు భవనాన్ని పరిశీలించి ప్రతిపాదించారు. కొమురవెల్లి కస్తూర్బాతో పాటు దూల్మిట్ట కస్తూర్బా విద్యార్థులకు ఊరట కలగనున్నప్పటికీ ఇప్పటికే కొనసాగుతున్న చేర్యాల కస్తూర్బా అడ్మిషన్లపై ప్రభావం చూపనుంది. చేర్యాలలో తాత్కాలికంగా కాకుండా దూల్మిట్ట మండల కేంద్రంలో ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటే ఆ మండల విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది.


కొమురవెల్లి కస్తూర్బా భవనం


ప్రజావాణిలో వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

ప్రజావాణికి 49 ఫిర్యాదులు

- ప్రజా వినతులపై నిర్లక్ష్యం వద్దు : కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, మే 12(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో స్వీకరించిన వినతులపై నిర్లక్ష్యం వద్దని, వాటిని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 49 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని సంబంధిత అధికారులు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కాలువ నిర్మించారు.. దారి మరిచారు

చెల్లాపూర్‌లో 2018లో మిషన్ కాకతీయలో భాగంగా కాలువ నిర్మాణం చేపట్టారు. అక్కడ దారి లేకపోవడం వల్ల దాదాపు 300 మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆ గ్రామ ప్రజలు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పొలాలకు వెళ్లడానికి, పశువులను తీసుకెళ్లడానికి ఇబ్బంది అవుతుందని చెప్పారు. వేరే దారిలో చుట్టూ ఎనిమిది కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి వస్తుందని వాపోయారు. బ్రిడ్జి నిర్మిస్తే అందరికీ అనుకూలంగా ఉంటుందని చెప్పారు.

కలెక్టర్‌కు ఆహ్వానపత్రిక అందజేత

సిద్దిపేటలోని వేంకటేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని కలెక్టర్ మనుచౌదరికి, అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్‌కు వేంకటేశ్వర ఆలయ అర్చకులు, పాలక వర్గం సభ్యులు ఆహ్వానపత్రికను అందజేశారు.



రెండేళ్లయినా పూర్తి కాని పనులు

- చోద్యం చూస్తున్న కాంట్రాక్టర్
- పట్టించుకోని అధికారులు

నారాయణఖేడ్, మే 12(ఆంధ్రజ్యోతి): రెండు జిల్లాల మధ్య రాకపోకలకు ఉపయోగపడే నారాయణఖేడ్ - సిర్గాపూర్ రహదారి విస్తరణ పనులు ప్రారంభించి రెండేళ్లు కావస్తున్నా కిలో మీటర్ కూడా పూర్తి కాకపోవడంతో వాహన చోధకులు ఈ రోడ్డుపై ప్రయాణం చేయడానికి భయపడుతున్నారు. నారాయణఖేడ్ పట్టణ శివార్లలోని దెగుల్‌వాడి క్రాస్ రోడ్స్ నుంచి సిర్గాపూర్ వరకు 12 కి.మీల రోడ్డును విస్తరించడం కోసం 2023 సెప్టెంబరు 19న రూ.15 కోట్లతో పనులను ప్రారంభించారు. ఈ రోడ్డు పనులను అప్పటి మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. ఈ పనులు చేపట్టిన కన్‌స్ట్రక్షన్ కంపెనీవారు రోడ్డు విస్తరణ కోసం కొన్ని చోట్ల రోడ్డుకు ఇరువైపులా తవ్వకాలు చేపట్టారు. కొన్ని చోట్ల మెటలింగ్ పనులు చేసి, అసంపూర్తి దశలో వదిలి వేశారు. దీంతో నారాయణఖేడ్ నుంచి సిర్గాపూర్, నల్లవాగు, కల్హేర్, కామారెడ్డి జిల్లా పిట్లం ప్రాంతాలకు వెళ్లే వాహన చోదకులు ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే భయపడుతున్నారు. రాత్రి సమయంలో ఈ రోడ్డుపై ప్రయాణం చేస్తే కచ్చితంగా ప్రమాదాల బారిన పడతామని పలువురు వాహన దారులు పేర్కొంటున్నారు. రోడ్డు పనులు అసంపూర్తి దశలో వదలి వేయడంతో, ప్రమాదకరంగా మారినా గత్యంతరం లేక ఈ రోడుపైనే ప్రయాణం చేయాల్సి వస్తుందని తుర్కపల్లి, ర్యాకల్, గంగాపూర్, చల్లగిద్ద తండా తదితర గ్రామాల వాసులు అంటున్నారు. తాము అధికారులకు ఫిర్యాదు చేస్తే కాంట్రాక్టర్ రెండు, మూడు రోజులు పనులు చేయించి, తిరిగి వదిలేస్తున్నాడని, అందువల్ల అధికారులు స్పందించి ఈ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.


రోడ్డు విస్తరణ కోసం వేసిన శిలాఫలకం


గతుకులమయంగా ఉన్న సిర్గాపూర్ రోడ్డు

దేవుడు గుర్తొస్తున్నాడు



నారాయణఖేడ్ నుంచి మా గ్రామమైన ర్యాకల్‌కు వెళ్లాలంటే రోడ్డు పనులు అసంపూర్తి దశలో ఉండడంతో, దేవుడు గుర్తొస్తున్నాడు. నేను ప్రతి రోజు నారాయణఖేడ్‌కు వస్తుంటాను. రాత్రి సమయంలో స్వగ్రామానికి వెళ్లడానికి భయంభయంగా వెళ్లాల్సి వస్తుంది.

- మంగలి నర్సింలు

త్వరలో పనులు పూర్తి చేయిస్తాం

నారాయణఖేడ్ - సిర్గాపూర్ రోడ్డు విస్తరణ కోసం రూ.15 కోట్లు మంజూరయ్యాయి. పనులు అసంపూర్తి దశలో ఉన్న మాట వాస్తవమే. ఇటీవల కాంట్రాక్టర్‌కు చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు చెల్లించాం. త్వరలోనే పనులు ప్రారంభింప చేసి పూర్తి చేయిస్తాం. పనుల పట్ల కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే నోటీసులు ఇస్తాం.

- నర్సింలు, ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఈఈ

ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'ప్రజావాణి'


ప్రజావాణిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణి అని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చే అర్జీలను సంబంధిత శాఖల అధికారులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని, సమస్యలు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ప్రజావాణిలో 73 అర్జీలు అందాయన్నారు.


ఎనిమిదేళ్ల సమస్యకు పరిష్కారం

హత్నూర మండలం గుండ్ల మాచనూర్ గ్రామానికి చెందిన బేగరి శివయ్యకు సంబంధించిన సర్వే నంబర్ 267-అలో 13 గుంటల పట్టా భూమి ఉంది. అయితే 2018 నుంచి ఇట్టి పట్టా భూమి గత ధరణిలో సాంకేతిక నిషేదిత జాబితాలో ఉందని, ఆ రైతు పలుమార్లు అధికారుల చుట్టు తిరిగి తిరిగి అలసిపోయి చివరి ప్రయత్నంగా ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. కలెక్టర్ వల్లూరు క్రాంతి ప్రత్యేక చొరవ తీసుకుని శివయ్య సమస్యను వెంటనే పరిష్కరించారు. తన సమస్యను పరిష్కరించినందుకు రైతు సంతోషం వ్యక్తం చేస్తూ కలెక్టర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపాడు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి తీవ్రగాయాలు


కిషన్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న ఎన్‌హెచ్‌ఏఐ వైద్య సిబ్బంది

పుల్‌కల్, మే 12 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలంలో ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారు జామున జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి వ్యక్తులకు తీవ్రమైన గాయాలయ్యాయి. మండలంలోని బొమ్మారెడ్డిగూడెం గిరిజన తండాకు చెందిన భార్యాభర్తలు జదావత్ కిషన్, సావిత్రిబాయి సోమవారం తెల్లవారు జామున టీవీఎస్ ఎక్సల్‌పై సంగారెడ్డి పట్టణానికి వెళ్తున్నారు. చౌటకూర్ వద్ద సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారి పై ఓవర్ సర్వీసు రోడ్డుపై ఆరబెట్టిన వరి ధాన్యం కుప్పను ఢీకొట్టారు. ఈ సంఘటనలో భార్యాభర్తలిద్దరి కాళ్లు, చేతులకి బలమైన గాయాలయ్యాయి. ఎన్‌హెచ్‌ఏఐ అంబులెన్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యానికి సంగారెడ్డి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. తాడ్దానిపల్లి గ్రామ శివారులో టోల్‌ప్లాజా వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రమైనగాయాలయ్యాయి. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామానికి చెందిన బేగరి రాజు, బేగరి గోవర్ధన్, శివునాపురం విష్ణు, రమేశ్‌లు బోలేరో వాహనంలో సంగారెడ్డికి వెళ్తున్నారు. ముందు వెళ్తున్న డీసీఎం వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బేగరి రాజు, బేగరి గోవర్ధన్‌లకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పుల్కల్ ఎస్సై పాటిల్ క్రాంతికుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





సమస్యల పరిష్కారానికి కృషి


ఇందిరమ్మ ఇళ్ల సర్వే తనిఖీలో భాగంగా దివ్యాంగురాలు సంతోషతో మాట్లాడుతున్న కలెక్టర్

మెదక్ అర్బన్/చిలప్‌చెడ్, మే 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లోని ప్రజల సమస్యలను మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అడిగి తెలుసుకున్నారు. మండల పరిధిలోని గౌతాపూర్ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో భూ భారతి పథకంలో భాగంగా సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సును కలెక్టర్ రాహుల్‌రాజ్ తనిఖీ చేశారు. అనంతరం క్షేత్ర స్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ భారతి నూతన ఆర్ఓఆర్ రెవెన్యూ చట్టం పై పైలట్ ప్రాజెక్టుకింద చిలప్‌చెడ్ మండలాన్ని ఎంపిక చేసి రైతుల నుంచి సలహాలు సూచనలు భూ సంబంధిత సమస్యల దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని 16 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాల్సి ఉండగా ఇప్పటి వరకు 13 గ్రామాలలో సదస్సులు పూర్తి అయినట్లు తెలిపారు. రైతులు ఇచ్చిన దరఖాస్తులను తప్పని సరిగా నమోదు చేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో తనకు కూడా అవకాశం కల్పించాలని దరిపల్లి సంతోష వికలాంగురాలు కలెక్టరుకు విన్నవించింది.

దివ్యాంగ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తుగా భవిత కేంద్రాలు మారాయని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని భవిత కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.

అమరువీరుల స్థూపం నిర్మాణం కోసం జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో 145 సర్వే నెంబర్‌లో స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. అలాగే ఔరంగబాద్ శివారులోని సర్వే నెంబర్ 77లోని ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు.


ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ఫిర్యాదుదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

మెదక్ అర్బన్, మే 12(ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పజావాణికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు, అర్జీదారులు తరలివచ్చారు. కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

పోలీసు ప్రజావాణికి 16 ఫిర్యాదులు

మెదక్ అర్బన్, మే 12(ఆంధ్రజ్యోతి): పోలీసు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి 16 ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు.

క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

లాంగ్ టర్మ్ క్రికెట్ కోచింగ్ క్యాంపు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మెదక్ స్టేడియంలో ఏర్పాటు చేసిన క్యాంపును ఎస్పీ ప్రారంభించారు. పేద పిల్లలు, పోలీస్ సిబ్బంది పిల్లలను కోచింగ్ క్యాంపును వినియోగించుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, ఏఆర్ డీఎస్పీ రంగానాయక్, పట్టణ సీఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


బ్యాట్ పట్టిన మెదక్ ఎస్పీ

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్


నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

సిద్దిపేట క్రైం మే 12(ఆంధ్రజ్యోతి): ఐదు ద్విచక్ర వాహనాలను దొంగలించిన నిందితుడిని సిద్దిపేట వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సిద్దిపేట ఏసీపీ మధు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ వాసుదేవ రావు, ఎస్సై నవత, సిబ్బందితో కలిసి సోమవారం ఉదయం 9 గంటల సమయంలో సిద్దిపేట గవర్నమెంట్ హాస్పిటల్ టీ జక్షన్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో దుబ్బాక మండలం రామక్కపేట గ్రామానికి చెందిన శనిగరం బైక్ పై వస్తున్న శ్రీకాంత్ అనే వ్యక్తిని ఆపి బైక్‌కి సంబంధించిన పేపర్లు చూపించమని అనగానే మోటార్ సైకిల్ వదిలిపెట్టి పారిపోవడానికి ప్రయత్నించగా పట్టుకొని విచారించగా శ్రీకాంత్ బైకులు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. గత సంవత్సరం మే నెలలో సిద్దిపేట ఏరియా హాస్పిటల్ పార్కింగ్ నుంచి ఈ బైకును దొంగతనం చేసి నడుపుకుంటున్నానని తెలిపాడు. అదేవిధంగా ఈ సంవత్సరం జనవరిలో సిద్దిపేట కోటిలింగాల టెంపుల్ ముందు పార్కు చేసిన ఏపీ 36 ఏ 1586 బైక్‌ను , ఈనెల 3, 10వ తేదీలన రైతు బజార్ నుంచి టీవీఎస్ రాడాన్ బైక్‌ను, హోండా షైన్ బండిని, తదుపరి దుబ్బాక హబ్సీపూర్ చౌరస్తా వద్ద పార్కు చేసిన స్ప్లెండర్ ఏపీ 10 ఏఎస్ 6920 బైక్‌ను దొంగలించానని ఒప్పుకున్నాడు. వాటిని ఎక్కువ రేటుకు అమ్ముకుందామని ఇంటిలో దాచి పెట్టానని తెలుపగా, పోలీసులు అతని స్వగ్రామానికి వెళ్లి 5 బైకులను స్వాధీనం చేసుకున్నారు .(స్వాధీనం చేసుకున్న బైకుల విలువ 2,55,000) నిందితుడిని అరెస్టు చేసి జ్యూడీషియల్ రిమాండ్‌కు పంపించినట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో సీసీ కెమెరాలు టెక్నాలజీ ద్వారా ఇన్స్పెక్టర్, పోలీస్ సిబ్బంది కీలకపాత్ర వహించారని త్వరలో అందరికీ సీపీ చేతుల మీదుగా రివార్డు అందజేస్తామని ఏసీపీ తెలిపారు

గుండెపోటుతో ఉపాధి హామీ కూలీ మృతి

జహీరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని రాయిపల్లి(డి) గ్రామానికి చెందిన ఎర్రోళ్ల కమలమ్మ(67) సోమవారం ఉదయం గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలింది. రోజు మాదిరిగానే ఆమె సోమవారం ఉదయం గ్రామశివారులో ఉపాధిహామీ పనులుచేసేందుకు వెళ్లింది. ఈ క్రమంలో గుండెనొప్పి రావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించే క్రమంలో మృతి చెందిందని ఏపీవో అశోక్‌కుమార్ తెలిపారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

వర్గల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : కూతురు వివాహం కోసి చేసిన అప్పుల బాధతో ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. వర్గల్ మండలం గిర్మాపూర్ గ్రామానికి చెందిన సాయిల సుశీల (44) అనే మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. సంఘటనకు సంబంధించి గౌరారం పోలీస్‌స్టేషన్ ప్రొబేషనరి ఎస్సై కీర్తి రాజు తెలిపిన వివరాలు మేరకు. మండల పరిధిలోని గిర్మాపూర్ గ్రామానికి చెందిన సాయిల అశోక్‌కు భార్య సుశీల, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కూతూరు వివాహం కోసం చేసిన అప్పుతో బాధపడుతూ సుశీల తీవ్ర మనస్తాపం చెందేదని తెలిపారు. అప్పు ఎలా తీర్చేదని బాధపడుతూ ఆదివారం ఉదయం వారి వ్యవసాయ పొలం వద్ద సుశీల గుర్తు తెలియని మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కీర్తి తెలిపారు.





భూలక్ష్మమ్మ జాతరలో హోరాహోరీగా కుస్తీ పోటీలు

నారాయణఖేడ్, మే 12 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ మండలం తుర్కపల్లి భూలక్ష్మమ్మ జాతర అంగరంగా వైభవంగా కొనసాగుతున్నది ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం కుస్తీ పోటీలను నిర్వహించారు. కుస్తీ పోటీల్లో సాధారణంగా పహిల్వాన్‌లు, బాలురు మాత్రమే తలపడతారు. ఈ పోటీల్లో బాలికలు సైతం సత్తాచాటారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి వచ్చిన శిరీశ, సంగీత, గీత, మహారాష్ట్రకు చెందిన పల్లవి కుస్తీ పోటీల్లో పాల్గొనగా, వారిని జనాలు చప్పట్లతో ప్రోత్సహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోటీలు నిర్వహించగా, విజేతలకు రూ.10 నుంచి రూ.100, రూ.500, రూ.1000 వరకు కుస్తీ పోటీని బట్టి నగదు బహుమతిని అందించారు. చివరి కుస్తీ పోటీ విజేతకు రూ.5000 అందజేశారు.


తుర్కపల్లిలో నిర్వహించిన కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

కన్నులపండుగగా ఎడ్లబండ్ల ప్రదర్శన

గడిపెద్దాపూర్‌లో మల్లికార్జునస్వామి జాతర ప్రారంభం

అల్లాదుర్గం, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గడిపెద్దాపూర్‌లో ఎడ్లబండ్ల ప్రదర్శనను కన్నులపండుగగా నిర్వహించారు. గ్రామంలోని మల్లికార్జునస్వామి జాతర సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఉత్సవాల్లో భాగంగా భక్తుల ఎడ్లబండ్లను రంగు రంగుల పూలు, వివిధ రకాల క్లాత్‌లతో అలంకరించి, గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ప్రదర్శించి ఆలయానికి తీసుకెళ్లారు. అనంతరం ఆలయం చుట్టూ ఐదు ప్రదర్శనలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని, మొక్కులను తీర్చుకున్నారు. జాతరలో ఎలాంటి అల్లర్లు జరగకుండా స్థానిక సీఐ రేణుకారెడ్డి, ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డితో ఆధ్వర్యంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.


మల్లికార్జునస్వామి


గడిపెద్దాపూర్‌లో ఎడ్లబండ్ల ప్రదర్శన

మైనింగ్ మాయ.. మట్టి మాఫియా

రాంపూర్‌లో ఆగని దందా.. పట్టించుకోని అధికారులు

కొల్చారం, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాంపూర్‌లో ఓవైపు బ్లాస్టింగ్‌లతో క్రషర్ వ్యాపారులు దడ పుట్టిస్తుంటే.. మరోవైపు మట్టిని కొల్లగొడుతూ ప్రకృతిని ధ్వంసం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులను తుంగలో తొక్కుతూ ఇష్టారీతిన క్రషింగ్ చేపడుతున్నా.. గుట్టలను తవ్వేస్తూ టిప్పర్లలో మట్టిని రవాణా చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై గ్రామస్థులు మండిపడుతున్నారు.

ఇష్టారీతిన క్రషింగ్

బ్లాస్టింగ్‌లతో పక్కనే ఉన్న రాంపూర్ గ్రామంలోని ఇళ్లకు పగుళ్లు వస్తున్నా సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈనెల 1న 'గోరంత అనుమతి.. కొండంత తవ్వకాలు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో మైనింగ్ మాయ గురించి ప్రచురితమైంది. రాంపూర్ గ్రామస్థులతో పాటు చుట్టపక్కల గ్రామాల్లోనూ ఈ కథనంపైనే చర్చ జరిగింది. క్రషింగ్‌తో వెలువడుతున్న దుమ్ముధూళితో పంటలు పాడుతున్నాయని, బైక్‌లపై వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని మండిపడ్డారు. తరచూ టిప్పర్‌లు వస్తూ, పోతూ ఉండడంతో రోడ్లు దెబ్బతింటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'ఆంధ్రజ్యోతి' తమ సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చినా సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల తీరుపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అండదండలతోనే ఇష్టారీతిన క్రషింగ్ చేస్తున్నారని, అనుమతి లేకుండానే టిప్పర్‌లలో కంకర తరలిస్తున్నా చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



రాంపూర్ శివారులో తవ్వేస్తున్న గుట్టలు, ఎక్స్‌కవేటర్‌తో తవ్వుతూ టిప్పర్‌లోకి వేస్తున్న మట్టి

మట్టి.. కొల్లగొట్టి

రాంపూర్ గ్రామ శివారులోని 373 సర్వే నంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమి నుంచి మట్టిని కొల్లగొడుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే ఎక్స్‌కవేటర్లతో తవ్వేస్తున్నారు. రోజు టిప్పర్లలో తరలిస్తూ మట్టి మాఫియా సొమ్ము చేసుకుంటున్నది. స్థానికంగా ఓ వెంచర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ వెంచర్ కోసం ప్రభుత్వ భూమి నుంచే అనుమతులు లేకుండానే మట్టిని తరలిస్తున్నారు. ఒక సామాన్యుడు ఇంటి నిర్మాణం కోసం మట్టిని తరలిస్తే రెవెన్యూ అధికారులు కేసులు చేస్తారు. కానీ ఏకంగా టిప్పర్లతోనే తరలిస్తుంటే ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ నర్సరీ, వైకుంఠధామం మధ్య దారిలో నుంచి యథేచ్ఛగా టిప్పర్లు వెళుతుంటే ఏం చేస్తున్నారని మండిపడుతున్నారు. నర్సరీలో ఉన్న మొక్కలపై దుమ్ము పడడంతో ఎదగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇష్టారాజ్యంగా కొనసాగుతున్న తవ్వకాలను అడ్డుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఇష్టారాజ్యంగా నల్లమట్టి తరలింపు

హత్నూర, మే 12 (ఆంధ్రజ్యోతి) : హత్నూర శివారులోని సాకి చెరువు నుంచి కొందరు నల్లమట్టిని ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారు. వ్యవసాయ భూమిలో గుంతల పూడ్చుకునేందుకు అని చెబుతూ సుమారు 20 నుంచి 30 ట్రాక్టర్లను పెట్టి వందల ట్రిప్పుల మట్టిని తరలించారు. ఇదేమిటని ప్రశ్నించిన రైతులకు అన్ని అనుమతులు ఉన్నాయని సమాధానం ఇస్తూ మట్టిని కొల్లగొడుతున్నారు. అధికారులు పూర్తి విచారణ చేసి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.



సాకి చెరువులో నుంచి మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌లు

ఎక్స్‌కవేటర్ సీజ్

నర్సాపూర్, మే 12 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని హన్మంతాపూర్ సమీపంలో మట్టి తవ్వకాలపై సోమవారం రెవెన్యూ, మైనింగ్, పోలీసులు సంయుక్తంగా దాడిచేసి ఎక్స్‌కవేటర్‌ను సీజ్‌చేశారు. సర్వే నంబరు 134లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు వారు దాడులు చేశారు. తీసిన గుంతల నుంచి ఎంతమేర మట్టి తరలించారనే విషయమై లెక్కలు తీసి, సదరు వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

టీబీ బాధితుల రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ ప్రతినిధులు


సంగారెడ్డి టీబీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ ప్రతినిధులు

సంగారెడ్డి అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి) : టీబీ బాధితుల రికార్డులను సక్రమంగా నిర్వహించాలని డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ ప్రతినిధులు సూచించారు. సంగారెడ్డిలోని టీబీ కార్యాలయాన్ని డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ స్నేహశుక్లా, స్టేట్ టీబీ ట్రైనింగ్ అండ్ డిమోనిస్ట్రేషన్ సెంటర్(ఎస్‌టీడీసీ) ఎపిడమాలజిస్ట్ డా.రాజేశ్వరి సోమవారం సందర్శించారు. 2024 ఏడాదికి సంబంధించి టీబీ పేషెంట్ల ట్రీట్‌మెంట్ కార్డులు ట్రీట్‌మెంట్ యూనిట్ వాకీగా వెరిఫికేషన్ చేశారు. జిల్లాలో 36 డ్రగ్ రెసిస్టెంట్ కేసులపై ఆరా తీశారు. టీబీ పేషెంట్లకు సకాలంలో మందులు అందించాలని, ట్రీట్‌మెంట్ ఫాలోఅప్ చేయాలని సూచించారు. వారి వెంట డీటీసీవో డా.అరుణకుమారి, టీబీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో రైతు ఐడీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ

మనోహరాబాద్ మే 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు ఐడీ విధానంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో వ్యవసాయ అధికారులతో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించింది. మనోహరాబాద్ మండల కేంద్రంలోని కోనాయపల్లి గ్రామంలో ఏఈవో నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో రైతులకు డిజిటల్ గుర్తింపు కార్డును అందజేస్తున్నారు. రైతు ఐడీలో 11 అంకెల నంబర్, పేరు, ఆధార్, ఫోన్ నంబర్, పాస్‌బుక్ వివరాలు, భూమి రకం, సర్వే నంబర్లు, సాగు చేసిన పంట తదితర వివరాలుంటాయని ఏఈవో తెలిపారు. కేంద్ర పథకాలైన కిసాన్ నిధి, ఫసల్ బీమా, సాయిల్ హెల్త్ కార్డులకు ఈ కార్డు తప్పనిసరి, లేకపోతే ఆయా పథకాలు అందవని పేర్కొన్నారు. ప్రతి ఒక్క రిజిస్ట్రేషన్ చేసుకుని డిజిటల్ గుర్తింపు కార్డును పొందాలని ఆయన సూచించారు.


కోనాయపల్లిలో రైతుల వివరాలను నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు

హైవేల విస్తరణతో అభివృద్ధికి బాటలు

అధికారులు సమన్వయంతో పనిచేయాలి
మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

సంగారెడ్డి రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారుల విస్తరణతో అభివృద్ధికి బాటలు పడతాయని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నేషనల్ హైవే అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ రహదారుల విస్తరణ ద్వారా పారిశ్రామిక అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు ప్రయాణ సమయం ఆదా అవుతుందని తెలిపారు. తక్కువ సమయంలో గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవచ్చన్నారు. సమృద్ధిగా నీరు, విద్యుత్ సౌకర్యాలు, రవాణా సదుపాయం, సరైన సమాచార వ్యవస్థ ఉంటే ఆ ప్రాంతం శరవేగంగా అభివృద్ధిలోకి వస్తుందని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని రఘునందన్‌రావు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సహకారంతో ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. జాతీయ రహదారుల నిర్మాణంలో అవసరమైన మట్టిని చెరువులు, సాగునీటి ప్రాజెక్టుల నుంచి ఉచితంగా తీసుకోవడం ద్వారా ఆయా ప్రాంతాల రైతులకు ఎంతో మేలు చేసినవారమవుతామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మాధురి, చంద్రశేఖర్, జాయతీ రహదారుల ఇంజనీర్లు, మెట్రో, విద్యుత్ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దేశ ద్రోహులకు మద్దతు ఇస్తున్న కాంగ్రెస్ పార్టీ

కంది, మే 12 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ దేశ ద్రోహులకు మద్దతు ఇస్తుందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఆరోపించారు. సోమవారం జిన్నారం మత ఘర్షణలో అరెస్ట్ అయిన బీజేపీ కార్యకర్తలను కందిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలులో ఎంపీ రఘునందన్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశద్రోహులను వెంటనే పంపించాలని కేంద్ర హోంశాఖ ఆదేశాలు ఇచ్చినప్పటికీ అధికార యంత్రాంగం స్పందించడం లేదని విమర్శించారు. దీంతో దేశద్రోహులకు, కాంగ్రెస్‌కు ఉన్న సంబంధం బయటపడిందన్నారు. జిన్నారంలోని కోదండ రామాలయం భూముల్లో అక్రమంగా మదర్సా నిర్మించారని, ఇక్కడి మదర్సాలో బంగ్లాదేశీయులు ఎందుకు ఉంటున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జిన్నారంలో ఏం జరుగుతుందో విచారణ జరిపించాలని ఉన్నతాధికారులను నాలుగుసార్లు ఎంపీగా అడిగినా సరైన సమాధానం ఇవ్వడం లేదని తెలిపారు.


కంది జైలు వద్ద మాట్లాడుతున్న రఘునందన్‌రావు

బుద్ధుడి బోధనలు అనుసరణీయం

నవసమాజ నిర్మాణానికి కృషి చేద్దాం
జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్

సంగారెడ్డి, మే 12 (ఆంధ్రజ్యోతి) : గౌతమ బుద్ధుడి బోధనలు అందరికీ అనుసరణీయమని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్ అన్నారు. జహీరాబాద్ మండలంలోని బూచనెల్లి గ్రామంలో సోమవారం గౌతమబుద్ధుడి విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గౌతమ బుద్ధుడి జీవితం ప్రపంచానికి స్ఫూర్తిదాయకమని, సమస్త మానవాళికి అహింస, సత్యం గొప్పతనాన్ని చాటి చెప్పిన గొప్పమహనీయుడని కొనియాడారు. బూచనెల్లిలో బుద్ధవిహార్ ఏర్పాటుకు కృషి చేసిన కమిటీ సభ్యులను, గ్రామస్థులను ఎంపీ అభినందించారు. బుద్ధవిహార్ అభివృద్ధికి తనవంతు బాధ్యతగా కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్, టీఏస్జీవో రాష్ట్ర నాయకులు శ్యామ్, సమతా సైనిక్‌దళ్ నాయకులు రవీందర్, నాయకులు కండెం నర్సింహులు, శుక్లవర్ధన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అత్తర్‌అహ్మద్, నర్సయ్య, జనార్ధన్, మొగులయ్య, రాంచందర్ భీంవంశీ, శ్రీనివాస్, బాల్‌రాజ్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.


బుద్ధుడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎంపీ సురేష్‌షెట్కార్

సిద్ధివినాయక ఆలయంలో ఎంపీ పూజలు

న్యాల్‌కల్,మే 12(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులో స్వయంభువుగా వెలసిన సిద్ధివినాయకుడిని సోమవారం జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్ దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆయన వెంట నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సిద్ధిలింగయ్యస్వామి తదితరులు ఉన్నారు.

గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు

సీట్ల భర్తీకి 15, 16వ తేదీల్లో కౌన్సెలింగ్

నర్సాపూర్/హయత్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోని గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రీజినల్ కో- ఆర్డినేటర్‌లు గంగారాం, కె.నాగార్జునరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15, 16వ తేదీలలో హయత్‌నగర్ కల్వంచ శాంతినగర్‌లోని బాలుర గురుకుల ప్రతిభ కళాశాలలో ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. 15వ తేదీన బాలురకు, 16న బాలికలను కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మెదక్ జిల్లాకు సంబంధించి.. నర్సాపూర్‌లోని అల్లూరి సీతారామరాజు కళాశాలలో ఎంపీసీ, బీపీసీ, సీఈసీ, ఏఅండ్‌టీ గ్రూపులలో ఖాళీలు ఉన్నాయని, భర్తీకి 15వ తేదీన కామారెడ్డిలోని నాగిరెడ్డిపేట గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. హాజరయ్యే విద్యార్థినీ, విద్యార్థులు బదిలీ ధ్రువీకరణ పత్రం, పదో తరగతిలో సాధించిన మార్కుల మెమో, స్టడీ, కండక్టు సర్టిఫికెట్లు, 2024-25 సంవత్సరానికి సంబంధించిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల వారికి వార్షిక ఆదాయం 1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలకు మించి ఉండరాదని తెలిపారు. ఆధార్ జిరాక్స్, స్పోర్ట్స్, పీహెచ్‌సీ, ధ్రువీకరణ పత్రాలు, మూడు కలర్ ఫొటోలు, రెండు జతల జిరాక్స్ పత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని గిరిజన విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. ప్రతీ గ్రూపు నందు ఎస్టీ విద్యార్థులతో పాటు ఎస్సీ, బీసీ, ఓసీ, స్పోర్ట్స్, పీహెచ్‌సీ కేటగిరీలో పరిమిత సీట్లు ఉన్నాయని తెలిపారు. ఇతర వివరాలకు 9502050715, 9603431550 నంబర్‌లను సంప్రదించాలని కోరారు.

ఘనంగా వేణుగోపాలస్వామి గరుడ సేవ

శివ్వంపేట, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దొంతి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం ఆలయ పూజారి గోపాలకృష్ణశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి గరుడసేవను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ హాజరై పూజలు చేశారు. మహిళలు మంగళహారతితో గరుడ సేవకు స్వాగతం పలికారు. గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు శ్రవణ్‌కుమార్‌రెడ్డి, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.


గరుడ వాహనంపై వేణుగోపాలస్వామి

వీరభద్ర స్వామి ఆలయంలో వైభవంగా చండీ హోమం


చండీ హోమం నిర్వహిస్తున్న అర్చకుడు

గుమ్మడిదల, మే 12 (ఆంధ్రజ్యోతి) : పౌర్ణమిని పురస్కరించుకుని మండలం పరిధి బొంతపల్లిలోని భద్రకాళీ సహిత వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం చండీ హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో శశిధర్, పర్యవేక్షకులు సోమయ్య ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో వేద పండితులు హోమాన్ని నిర్వహించారు. అమ్మవారి చల్లని దీవెనలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆరోగ్యంగా ఉండాలని హోమం నిర్వహించినట్లు ఈవో తెలిపారు.

'గౌరవెల్లి' భూనిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి చాడ లేఖ

హుస్నాబాద్‌రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): గౌరవెల్లి ప్రాజెక్టు భూనిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి సోమవారం రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అక్కన్నపేట మండలం గుడాటిపల్లి గ్రామస్థులు పెట్టుకున్న అర్జీని సత్వరమే పరిష్కరించాలని, ముంపు బాధితులకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.

సంక్షోభ వసతి గృహాలు

క్రమేపీ దూరమవుతున్న విద్యార్థులు
నెల రోజుల్లో విద్యాసంవత్సరం ప్రారంభం
కలెక్టర్ చొరవ తీసుకుంటే హాస్టళ్ల మనుగడ

మద్దూరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంక్షేమ వసతి గృహాలు సంక్షోభంలో చిక్కుకున్నాయి. వార్డెన్ల నిర్లక్ష్యం, ఉన్నతధికారుల పర్యవేక్షణ లోపంతో క్రమేపీ విద్యార్థులు దూరమవుతున్నారు. సిద్దిపేట జిల్లా లద్నూరులోని ఎస్సీ, బీసీ, ధూళిమిట్టలోని ఎస్సీ, మద్దూరులోని బీసీ హాస్టళ్లు ఇప్పటికే మూతపడ్డాయి. ఇప్పటికైనా వీటిని పట్టించుకోకపోతే ప్రతీ మండలంలోని సంక్షేమ హాస్టళ్ల గతి ఇలానే మారుతోంది. మరికొన్ని రోజుల్లో విద్యా సంవత్సరం ప్రారంభం కానుండడంతో ఈ హాస్టళ్లలో సౌకర్యాలు మెరుగుపర్చి, వార్డెన్లను కేటాయిస్తే పేద విద్యార్థుల చదువుకు ఎంతగానో ఉపయోగపడతాయి.

వసతి గృహాల వార్డెన్లు స్థానికంగానే నివాసం ఉంటూ హాస్టళ్లను చూసుకోవాల్సి ఉండగా, పట్టణ ప్రాంతాల్లో నివాసముంటూ ఉన్నతాధికారుల కనుసన్నల్లో మెదులుతూ చుట్టపుచూపుగా వచ్చి పోయేవారు. రికార్డుల్లో విద్యార్థుల సంఖ్యను ఎక్కువగా చూపడంతో పాటు మెను ప్రకారం భోజనం, కాస్మొటిక్ ఛార్జీలు సక్రమంగా అందించే వారు కాదు.


మద్దూరులో మూతపడిన బీసీ హాస్టల్

బెడ్‌లు, తాగునీటి వసతి సరిగ్గా లేకపోవడం, కిటికీలు, తలుపులు ధ్వంసం కావడం తదితర కారణాలతో విద్యార్థులు క్రమేపీ హాస్టళ్లకు దూరమవుతూ వచ్చారు. ప్రభుత్వం బయోమెట్రిక్ విధానాన్ని అమల్లోకి తెచ్చినా, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినా అధికారులు పర్యవేక్షణ లోపంతో ప్రయోజనం లేకుండా పోయింది. హాస్టళ్ల పనితీరులో మార్పునకు ఏమాత్రం దోహదం చేయలేదు. వార్డెన్లు లేని చోట ప్రభుత్వం ఇన్‌చార్జీ వార్డెన్లకు బాధ్యతలను అప్పగించడంతో మరింత అధ్వానంగా తయారయ్యాయి. గతంలో ప్రభుత్వ ఆదేశానుసారంగా స్థానిక తహసీల్దార్లు రాత్రిళ్లు హాస్టళ్లను విజిట్ చేసి నిద్రకు ఉపక్రమించేవారు. సమస్యలపై విద్యార్థులను ఆరా తీసి, వార్డెన్ల పనితీరుపై ఉన్నతాధికారులకు నివేదిక అందించేవారు. ఆ పరిస్థితులు క్రమేపీ కన్పించకుండా పోవడంతో హాస్టళ్లే కనుమరగవుతున్నాయి.

చొరవ చూపితే..

ఇటీవల ధూళిమిట్ట మండల కేంద్రంలో మూతపడిన హాస్టల్ దుస్థితిపై స్థానిక నాయకులు, గ్రామస్థులు సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన వసతి గృహాన్ని సందర్శించి, వచ్చే అకడమిక్‌కు కావల్సిన వసతులు సమకూర్చి పునఃప్రారంభమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. దీంతో పాటుగా మద్దూరు మండల కేంద్రంలో అన్ని వసతులతో కూడిన వసతి గృహంపై కూడా దృష్టి సారించాలని కోరుతున్నారు. జిల్లాలో సమస్యలతో సతమవుతున్న హాస్టళ్లను గుర్తించి, విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే కావల్సిన సౌకర్యాలను సమకూర్చేలా చూస్తే హాస్టళ్లు బాగుపడే అవకాశం ఉంది.

పనుల్లో జాప్యం.. ప్రజలకు శాపం



చేర్యాలలో బ్రిడ్జిపై ఒకే వైపు స్లాబ్ వేయడంతో ఎదురెదురుగా వాహనాల రాకపోకలు, మరోవైపు తవ్వి వదిలేసిన గుంతలు

- చేర్యాలలో గాంధీచౌక్ నుంచి బస్టాండ్ వరకు ట్రాఫికర్
- జనగామ-సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణలో భాగంగా బ్రిడ్జి పనుల్లో తీవ్ర జాప్యం
- బ్రిడ్జిపై ఓవైపు స్లాబ్ వేసి.. మరోవైపు గుంతలు తవ్వి వదిలేశారు
- ప్రమాదాలు జరిగినా పట్టించుకోని వైనం

చేర్యాల, మే 11 (ఆంధ్రజ్యోతి): రహదారి విస్తరణ పనుల్లో జాప్యం ప్రజలు, వాహనదారులకు శాపంగా పరిణమించింది. దీంతో చేర్యాల పట్టణంలోని గాంధీచౌక్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది. వివరాల్లోకి వెళ్తే.. జనగామ-సిద్దిపేట జాతీయప్రధాన రహదారి విస్తరణలో భాగంగా గాంధీచౌక్ వద్ద గత ఏడాది బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టారు. కానీ ఒకేమార్గంలో స్లాబ్ పూర్తిచేసినా, మరోమార్గంలో గోతులు తీసి చేతులేత్తేశారు. గాంధీచౌక్ నుంచి ఆర్టీసీబస్టాండ్ వరకు వన్ వే రాకపోకలు కొనసాగిస్తుండటంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. గతంలోని సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ ధ్వంసమవడంతో పరిసరాలు అంధకారంగా మారి రాత్రివేళ ప్రయాణించాలంటే భయాందోళనకు గురవుతున్నారు.

ఎమ్మెల్యే మందలించినా మారని తీరు

కాంట్రాక్టర్ ఎక్స్‌కవేటర్‌తో ఇష్టారీతిన తవ్వకాలు చేస్తూ, అర్ధాంతరంగా పనులు నిలిపివేస్తుండటంతో పరిసరాల్లో దుమ్ము,ధూళి కమ్ముకుని చుట్టుపక్కల దుకాణదారులు, గృహయాజమానులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. పనుల్లో జాప్యం పట్ల కొద్దిరోజులక్రితం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సూచనలు చేశారు. అయినా పనుల్లో పురోగతి లేక గాంధీ చౌక్ ప్రాంతం గుంతలమయమై ప్రమాదకరంగా మారింది. చిన్నపాటి వర్షం కురిసినా గుంతల్లో వరదనీరు చేరి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నా, సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పనుల్లో జాప్యమెందుకో?

రహదారి విస్తరణతో జిల్లాకేంద్రంతో పాటు పొరుగు గ్రామాలకు రయ్‌మని దూసుకెళుతుండగా, గాంధీచౌక్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు వాహనాలు నిలిచిపోతుండటం గమనార్హం. ఏమాత్రం ఆదమరిచినా ప్రాణాపాయం తప్పదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కల్వర్టునిర్మాణం కోసం తీసిన గోతిలో కారు ఇరుక్కుని వేలాడిన సంఘటన స్థానికులను తీవ్రంగా కలవరపరిచింది. ఇంత జరుగుతున్నా బ్రిడ్జి నిర్మాణంలో జాప్యం చేయడమెందుకని ప్రశ్నిస్తున్నారు. ఈవిషయమై జిల్లా అధికారులు, ఎన్‌హెచ్ అధికారులు స్పందించి మరిన్ని ప్రమాదాలు చోటు చేసుకోక ముందే బ్రిడ్జిపనుల వేగవంతానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముగిసిన వివేక్‌సంస్కార్ వేసవి శిబిరం



శిబిరంలో నేర్చుకున్న యోగాసనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సిద్దిపేట కల్చరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): శ్రీరామకృష్ణ సేవా సమితి సిద్దిపేట శాఖ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థుల కోసం చేపట్టిన ఉచిత వేసవి శిబిరం వివేక సంస్కార్ సోమవారంనాటితో ముగిసింది. ఈ నెల 1న ప్రారంభమైన ఉచిత శిబిరంలో విద్యార్థులకు యోగాసనాలు, ధ్యానం, భజనలు, ప్రార్థనా శ్లోకాలు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, కరాటే, అందమైన చేతిరాత, స్పీడ్ మ్యాథ్స్ నీతి కథలు, లెజిమ్స్, ఆటలు నిష్ణాతలైన శిక్షకులతో నేర్పించారు. ముగింపు సందర్భంగా విద్యార్థులు సమ్మర్ క్యాంపులో నేర్చుకున్న విద్యలను ప్రదర్శించారు. ఈ శిబిరంలో విద్యార్థులకు పిల్లలకు ఉచితంగా అల్పాహారం అందించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ ల్యాప్రోస్కోపిక్ సర్జన్ సుష్మిత్ మాట్లాడుతూ విద్యార్థులలో శారీరక, మానసిక క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందించడానికి ఇలాంటి సమ్మర్ క్యాంపులు ఉపయోగపడతాయన్నారు. వేసవి సెలవుల్లో పిల్లలు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంటూ విజ్ఞానాన్ని అందించే ఆటపాటలతో వారిలో ఉత్సాహాన్ని నింపడానికి ఈ కార్యక్రమం సహకరించిందన్నారు. సిద్దిపేట జిల్లాలో శ్రీరామకృష్ణ సేవాసమితి చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు నాగేందర్, ప్రధాన కార్యదర్శి ఎం రాజేశ్వరరావు, సురేందర్‌రెడ్డి, బాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రోగి కోలుకోవడంలో నర్సు పాత్ర కీలకం

● పలు చోట్ల అంతర్జాతీయ నర్సుల దినోత్సవం


సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవ కార్యక్రమం



గజ్వేల్‌లోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో కేక్ కట్ చేస్తున్న నర్సులు

సిద్దిపేట కల్చరల్/గజ్వేల్, మే 12 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని జిల్లాలోని పలు చోట్ల ఘనంగా జరుపుకున్నారు. సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ప్రపంచ మొట్టమొదటి నర్సు ఫ్లారెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కేక్ కట్ చేసే వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం విజయకుమారితో కలిసి ప్రిన్సిపాల్ కేటీ షిభా మీడియాతో మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చిన రోగి కోలుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారడంలో నర్సుల పాత్ర ఎంతో కీలకమైందని తెలిపారు. ప్రస్తుతం భారత్ పాక్ బార్డర్‌లో యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో సైన్యానికి ఎలాంటి నర్సింగ్ సేవలు అవసరం ఉన్నా నర్సులు, నర్సింగ్ విద్యార్థులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏవో సురేందర్, సూపరింటెంట్ రామ్ దామోదర్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు మంజుల, అనిత్, డీజీవో సూర్యప్రకాశ్, నర్సింగ్ సూపరింటెండెంట్ స్వరూప రాణి పాల్గొని మాట్లాడారు.

రోగులకు నిస్వార్థ సేవలను అందించడంలో నర్సులు ముందుంటారని, ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఆప్త మిత్రులుగా సేవలందిస్తారన్నారు. కార్యక్రమంలో ఫార్మాసిస్టు శ్రీనివాసచారీ, మోహన్, ఇన్ఫెక్షన్ కంట్రోల్ ఆఫీసర్ మహారాజ్ భాను, హెడ్‌నర్సులు, నర్సింగ్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

గీతా పారిశ్రామిక సంఘం ఎన్నిక

నంగునూరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : నంగునూరు మండలం నర్మెట్ట గీతా పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా బంధారం యాదగిరిని సంఘం సభ్యులు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా నాగిళ్ల చంద్రశేఖర్‌గౌడ్, డైరెక్టర్లుగా వడ్లకొండ శ్రీనివాస్, దమక్కపల్లి బాలవ్వ వీరన్నపేట అంజవ్వలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ గీతా పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా యాదగిరికి నియామక పత్రాన్ని కో ఆపరేటీవ్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ నాయక్ అందజేశారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో 19 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, మే 12(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 19 మంది పట్టుబడ్డారు. నిందితులను సోమవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరుపరచగా విచారణ అనంతరం వారికి రూ.34,500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

గ్రామపాలన అధికారులు వచ్చేస్తున్నారు

(5వ పేజీ తరువాయి)

నిర్ణయించడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుంది. జిల్లాలో దాదాపుగా 20వేల సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ములుగు, వర్గల్, మర్కుక్ మండలాలు హెచ్ఎండీఏ పరిధిలో ఉండకపోవడంతో గతంలో సాదాబైనామాలకు అవకాశం కల్పించలేదు. ఈ క్రమంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ములుగు మండల కేంద్రాన్ని రెవెన్యూ సమస్యల రహిత గ్రామంగా మార్చేందుకు చేపట్టిన సదస్సుల్లో ఒక్క గ్రామం నుంచే దాదాపుగా 50కి పైగా సాదాబైనామాలకు సంబంధించిన అర్జీలు వచ్చాయి. ఈ నేపథ్యంలో భూభారతి చట్టంలో హెచ్ఎండీఏ పరిధిలోని సాదాబైనామాలకు అవకాశం కల్పిస్తారా... లేదా వేచి చూడాలి.

వెంకట్రావ్‌పేటలో అన్నమాచార్య విగ్రహావిష్కరణ


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

తొగుట, మే 12 (ఆంధ్రజ్యోతి): తొగుట మండలం వెంకట్రావ్‌పేట గ్రామంలో అన్నమాచార్య విగ్రహాన్ని సోమవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు స్వామి, నాయకులు నరేందర్‌రెడ్డి అనిల్, రవిందర్, కొండల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

వరదరాజ్‌పూర్‌లో ఉచిత వైద్య శిబిరం

ములుగు, మే 12 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలం క్షీరాసాగర్ హంస హోమియోపతి కళాశాల వైద్యులు సోమవారం మర్కుక్ మండలం వరదరాజపూర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి సుమారు 70 మంది శిబిరంలో వైద్యసేవలను వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పుష్పలత, డాక్టర్ సంతోష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు హోమియోపతి వైద్యం ప్రాముఖ్యతను తెలియజేసే ఉద్దేశంతో శిబిరం నిర్వహించామన్నారు.

మహిళల రక్షణ చట్టాలపై అవగాహన

మద్దూరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లద్నూరులో ఉపాధిహామీ కార్మికులకు మహిళల రక్షణ చట్టాలతో పాటు సైబర్ నేరాలపై అప్రమత్తం చేసేందుకు హుస్నాబాద్ షీటీం బృందం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీం బృందం మహిళా కానిస్టేబుళ్లు ప్రశాంతి, స్వప్న మాట్లాడుతూ.. అనుకోకుండా ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 నెంబరు ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళల భద్రతకు ఎల్లవేళలా షీటీం అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ఉత్సవాల నిర్వహణకు ఎన్ఆర్ఐ విరాళం

చేర్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్త్యాలలో అభయాంజనేయస్వామిఆలయంలో నిర్వహించతల పెట్టిన నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలకు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ పెడుతల అమరేందర్‌రెడ్డి రూ.35వేలు విరాళంగా అందించారు. అలాగే బండోజు బ్రహ్మం రూ.27వేలు గేటు ఏర్పాటు నిమిత్తం విరాళ మందించినట్లు స్థానికులు తెలిపారు.

జిల్లాలో ఆధ్యాత్మిక సందడి


చిన్నకోడూరు: చంద్లాపూర్‌లో అలంకరించిన ఎడ్లబండ్లతో ఆలయాల వద్దకు ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్థులు


అక్బర్‌పేట-భూంపల్లి మండలం చౌదర్‌పల్లి దుబ్బరాజేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణంలో భక్తులు


తొగుట: వెంకట్రావ్‌పేటలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు

వర్గల్, మే 12 (ఆంధ్రజ్యోతి): వైశాఖమాసం పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం జిల్లాలోని పలు ఆలయాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొన్నది. వర్గల్ మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం స్వామివారికి శతకలశాభిషేకం నిర్వహించారు. ఆలయ వేద పండితుడు వేదాంతం మురళీధర చార్యుల నేతృత్వంలో ఉదయం 108 లీటర్ల ఆవుపాలతో కూడిన కలశాలను దాతల గోత్ర నామాలతో ప్రతిష్ఠాపించారు. అనంతరం వేద మంత్రోచ్చారణల మధ్యన రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవత మూర్తులకు 108 మంది భక్తులచే సహస్ర ధారాభిషేకం చేశారు.

● **తొగుట:** మండలంలోని వెంకట్రావ్‌పేట గ్రామం వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం శ్రీకృష్ణభగవాన్-రుక్మిణీ, సత్యభామ అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని ఆలయ భక్త మండలి ఆధ్వర్యంలో నేత్రపర్వంగా నిర్వహించారు. ముందుగా హనుమాన్ ఆలయం నుంచి శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం వరకు స్వామి వారిని మంగళవాయిద్యాలతో ఎదుర్కోళ్ల కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకుడురాజాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు.

● **కోహెడ:** మండలంలోని శనిగరం శ్రీలక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని పురోహితులు శ్రీరంగం సంతోష్, తిరుణహరి కేశవస్వామి చేతుల మీదుగా ఘనంగా నిర్వహించారు. అనంతరం యూత్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు.

● **దుబ్బాక:** అక్బర్‌పేట-భూంపల్లి మండలం చౌదర్‌పల్లి గ్రామంలోని దుబ్బ రాజేశ్వరాలయంలో శివపార్వతుల కళ్యాణోత్సవం వైభవంగా జరిగింది. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ జరిపారు.దుబ్బాకలోని శ్రీవెంకటేశ్వరాలయాన్ని సోమవారం విజయవాడ హనుమాన్ టెంపుల్ పీఠాధిపతి దుర్గాప్రసాద్‌జీ సందర్శించారు. హనుమాన్ మాలదారులతో కలిసి హనుమాన్ చాలీసా పారాయణం, మహాహనుమత్ యజ్ఞ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● **కొండపాక:** మండలంలోని దుద్దెడ ఆలయంలో చిత్ర పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుద్దెడ పురోహితుడు గొల్లపల్లి రమేష్‌శర్మ ఆధ్వర్యంలో మూలవిరాట్టు స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకం హోమం కార్యక్రమాలు జరిగాయి. హనుమాన్ దీక్ష మాలదారులకు భిక్ష కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా మర్పడగ విజయదుర్గా సమేత మల్లికార్జున స్వామి క్షేత్రంలో సోమవారం క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ పర్యవేక్షణలో నవావరణ హవనం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సామూహిక లలితాసహస్ర నామ స్తోత్ర పారాయణం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు

● **చిన్నకోడూరు:** మండలంలోని చంద్లాపూర్ గ్రామంలో లక్ష్మీరంగనాయకస్వామి గుట్ట చుట్టూ, గ్రామంలోని పలు ఆలయాల చుట్టూ గ్రామస్థులు ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో ఊరేగింపుగా వెళ్లి ప్రదక్షిణలు చేయించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం రథోత్సవం ఉంటుందని గ్రామస్థులు తెలిపారు.

ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణతా శాతం పెంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్

సిద్దిపేట కలెక్టరేట్, మే 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలలో మెరుగైన ఉత్తీర్ణత శాతం పెంచేలా పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో ప్రభుత్వ ఇంటర్మీడియట్ కాలేజీల ప్రిన్సిపాల్స్, ఆయా శాఖల వెల్ఫేర్ అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.... ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో ఆయా కళాశాలలవారీగా సమీక్ష నిర్వహించి ఎదురైన సమస్యలపై సంబంధిత ప్రిన్సిపాల్స్‌తో ఆరా తీశారు. చేర్యాల, దుబ్బాక, మిరుదొడ్డి, కోహెడ మండలాల్లోని ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులు ఎక్కువగా అడ్మిషన్లు తీసుకుంటారని, అందువల్ల ఎక్కువ అడ్మిషన్లు వచ్చే గ్రామాలను గుర్తించాలన్నారు. ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యం కోసం ఆర్టీసీ రీజనల్ మేనేజర్లు మెదక్, కరీంనగర్, జనగాంలకు లెటర్ పెట్టి బస్సు సౌకర్యం కల్పిస్తే ఎక్కువ మంది విద్యార్థులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. టీచర్స్, విద్యార్థుల రెగ్యులర్ హాజరుతో పాటు ప్రతీ నెల 3వ శనివారం తల్లిదండ్రులతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్నారు. జగదేవ్‌పూర్, మద్దూరు, దుళ్మిట్ట మండలంలో ప్రీ మెట్రిక్ బాలుర వసతి గృహాలు నూతనంగా ఎస్సీ హాస్టల్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. హాస్టళ్లలో విద్యార్థులు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని డీఈవోకు తెలిపారు. కార్యక్రమంలో డీఐఈవో రవీందర్ రెడ్డి, డీఈవో శ్రీనివాసరెడ్డి, డీబీసీడీవో నాగరాజమ్మ, డీఎండబ్ల్యూవో అహ్మద్, ఆయా కళాశాల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధ్యాయ శిక్షణ



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి

సిద్దిపేట కల్చరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాలు ఈ నెల 13వ తేదీ నుంచి సిద్దిపేట జిల్లాలో ప్రారంభం కానున్నాయని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన సన్నాక సమావేశం సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ఇందిరానగర్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఉపాధ్యాయులకు వివిధ శిక్షణ కేంద్రాల్లో సబ్జెక్టుల వారీగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు రెండు విడతలలో శిక్షణ ఉంటుందన్నారు. ప్రాథమికస్థాయిలో శిక్షణ పొందిన మండల రిసోర్స్‌పర్సన్‌లు ఈ నెల 20 నుంచి మండలస్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వవలసి ఉంటుందన్నారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, వివిధ పాఠ్యాంశాల్లో ఉపాధ్యాయులకు వృత్తిపర నైపుణ్యాలకు సంబంధించిన అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా శిక్షణ ఏర్పాట్లను సెంటర్ ఇన్చార్జిల సమావేశంలో విద్యాధికారి పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలోని అందరూ ఉపాధ్యాయులు తప్పనిసరిగా శిక్షణలో పాల్గొనాలని తెలిపారు. సమావేశంలో క్వాలిటీ కోఆర్డినేటర్లు బేతి భాస్కర్, రంగనాథ్, సెంటర్ ఇన్చార్జిలు రాజిరెడ్డి, ఉండ్రాతి రమేష్, శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, రవీందర్, జమీర్ ప్రాథమిక, ఉన్నత స్థాయి జిల్లా రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి


భూంపల్లిలో మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి, మే12(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించడం ద్వారా అధికలాభాలను ఆర్జించవచ్చునని రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. సోమవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని భూంపల్లి రైతువేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు, అన్నదాతలకు అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. పంటమార్పిడిచేసి సుస్థిర వ్యవసాయం చేయాలనికోరారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శ్వేత, రాజా, ఏడీఏ ఎల్లయ్య, ఉద్యానవన అధికారి రమేష్, ఏవో సత్యాన్వేష్, ఏఈవో లోహిత్, దుబ్బాక పీఏసీఎస్ చైర్మన్ కైలాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవి, రైతులు తదితరులున్నారు.

ఆలయానికి బోరుబావి మంజూరు చేసిన 'బండి'

హుస్నాబాద్‌రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్‌లోని పెద్దమ్మతల్లి ఆలయానికి నీటి సౌకర్యం కోసం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బోరు మంజూరు చేశారు. ఈ మేరకు సోమవారం ఆలయ ఆవరణలో బోర్ వేయగా నీరు పుష్కలంగా రావడం పట్ల ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

బుద్ధుడి బోధనలు అనుసరణీయం: ఎమ్మెల్సీ

గజ్వేల్ రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండలం ధర్మారెడ్డిపల్లి, కోమటిబండ వద్ద గల శ్రీ పాండవకృష్ణ ధ్యాన క్షేత్రంలో సోమవారం బుద్ధపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ యాదవరెడ్డి హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ధ్యానంపైన శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం ధ్యానక్షేత్రం స్థలదాతలు కర్మాల కుటుంబ సభ్యులను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి, కుమారస్వామి, నర్సింలు, బాలరెడ్డి, రాజిరెడ్డి, టీచర్ సత్యనారాయణ, బ్రహ్మచారి, వేణు, బాలకిషన్, ప్రశాంత్, కర్మాల కుటుంబ సభ్యులు, కొండపోచమ్మ దేవస్థాన మాజీ డైరెక్టర్ నిమ్మ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పీపుల్స్ ప్రోగ్రెసివ్ ట్రస్ట్‌కు విద్యార్థుల ఎంపిక

వర్గల్, మే 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 5న పీపుల్స్ ప్రోగ్రెసివ్ ట్రస్ట్ (పీపీటీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పాటవ పరీక్షలో వర్గల్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు సొప్పరి చైత్ర, మోతే దేవి ప్రసన్న, దారం రిషివర్ధన్‌రెడ్డి ఎంపికైనట్లు సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్ తెలిపారు. పేద విద్యార్థుల కోసం ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ప్రగతినగర్‌లో నిర్వహిస్తున్న పాఠశాలలో 5వ తరగతి నుంచి డిగ్రీ వరకు కార్పొరేట్ స్థాయిలో ఆంగ్ల మాధ్యమ విద్యతో పాటు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు.

ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

కొండపాక,మే 12 (ఆంధ్రజ్యోతి): మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మర్పడగకు చెందిన లగిశెట్టి నరేష్, ఉపాధ్యక్షులుగా ఎస్.రాజు, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.విష్ణు, కోశాధికారిగా లక్ష్మణ్, సలహాదారులుగా సంజీవ్, సురేందర్, కార్యవర్గ సభ్యులుగా సురేష్, పరమేశ్వర్, బాలరాజు, కరుణాకర్, మోహన్, భాను ప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నరేష్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

న్యూస్ బాక్స్

పాలీసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

గజ్వేల్ రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సులలో అడ్మిషన్‌ల కోసం నిర్వహించే పాలిసెట్ పరీక్ష ఈ నెల 13న గజ్వేల్ బాయ్స్ హబ్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని సీహెచ్‌వీ కృష్ణారావు, ఏరియా కోఆర్డినేటర్, సారంగపాణి తెలిపారు. బాయ్స్ హబ్‌లోని పాలిటెక్నిక్ కళాశాల, జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. మొత్తం 1,195 మంది పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 11 నుంచి 1:30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు.

ధూప దీప నైవేద్యం పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

రాయపోల్, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న అర్హత కలిగిన ఆలయాల్లో ధూప, దీప నైవేద్యాలు సమర్పించే పూజారులు గౌరవ వేతనం కోసం దరఖాస్తు చేసుకోవాలని రాయపోల్ తహసీల్దార్ కృష్ణమోహన్ పేర్కొన్నారు. అర్హత కలిగిన ఆలయాలకు నెలకు ధూప, దీప, నైవేద్యాలకు రూ. 4వేలు, అర్చకునికి గౌరవభృతిగా రూ. 6వేలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన పూజారులు ధర్మాదాయ దేవాదాయ శాఖ పాత జిల్లా కమిషనర్ కార్యాలయంలో ఈ నెల 24లోపు దరఖాస్తు పూర్తి చేసి అందజేయాలని తెలిపారు.

టీచర్స్ వెల్ఫేర్ సొసైటీ నూతన కార్యవర్గం

చిన్నకోడూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): చిన్నకోడూరు టీచర్స్ వెల్ఫేర్ సొసైటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నికల అధికారులు గొట్టిపర్తి రంగరాజేశం, పిన్నింటి రాంరెడ్డి సమక్షంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా 'రామిని మల్లేశం, అధ్యక్షుడిగా కనుగుల లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడిగా రాగిరి అంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా పిన్నింటి అన్నమారెడ్డి, కార్యదర్శిగా గొట్టిపర్తి జానకి రాములు, ఆర్థిక కార్యదర్శిగా ఎండీ అజీజ్, కార్యవర్గ సభ్యులుగా ఖాతా రాజనర్సయ్య, గుడుమల్ల రవి,ఆడిట్‌కమిటీ సభ్యులుగా గొట్టిపర్తి రంగ రాజేశం, రామిని రాజేశం ఎన్నికయ్యారు.

సర్కారు బడుల్లో మెరుగైన ఫలితాలు

మద్దూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నూటికి నూరు శాతం ఫలితాలు సాధిస్తున్నట్లు ఎంఈవో వరదరాజు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శతశాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఏర్పాటు చేసిన సన్మాన సభలో పాల్గొని మాట్లాడారు. ఉత్తమ ఫలితాల్ని సాధించడంలో కృషి చేసిన ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులను అభినందించారు. 541 మార్కులు సాధించిన తస్మియా మండల టాపర్‌గా నిలిచినందుకు అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను సన్మానించారు.

కష్టజీవులకు అండగా సీపీఐ

మద్దూరు, మే 12(ఆంధ్రజ్యోతి) : కష్టజీవులతో పాటు కార్మిక, కర్షలకు ఎర్రజెండా అండగా నిలబడుతుందని సీపీఐ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యుడుఅందె అశోక్ అన్నారు. సోమవారం మండలంలోని నర్సాయపల్లిలో మండల కార్యదర్శి జంగిలి యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన సీపీఐ గ్రామశాఖ 2వ మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం పీఐ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ముస్త్యాల సిద్దులు, సహాయ కార్యదర్శులుగా ఇర్రి బాల్‌రెడ్డి, చల్లా నర్సిరెడ్డి, కోశాధికారిగా మోకు కనకారెడ్డి, బస్వరాజు పర్శరాములు, చింతల సత్తయ్య, ముస్త్యాల రవి, కౌన్సిల్ సభులుగా పలువురు ఎన్నికయ్యారు.